# పోలికలు

అవసరాల రామకృష్ణారావు

రామం యింటికొచ్చేసరికి సరస్వతి కనిపించే చోటుల్లో కనిపించలేదు. ఉయ్యాలలో నెలల గుడ్డు అరవ పాటలు పాడుతోంది. దాన్ని ఆపసోపాలూపడి, డింగ్ డాంగ్ బెల్, జాక్ ఎండ్ జిల్ మొదలయిన యింగ్లీషు జోలపాటలు పాడి, ఊదరగొట్టి, ఊరుకోబెట్టి సరస్వతికోసం వెతుకుతే పెరట్లో చింతచెట్టుక్రింద సీతామ్మవారిలా కూర్చునుంది.

"నాతో మాటాడకండి, వెళ్ళండవతలికి" అంది. రామానికి ఏమీ అర్థంకాలేదు.

"మీకు నామీద ఏమాత్రం ప్రేమాభిమానాలున్నాయో తెలిసిపోయింది. ఇలారాకండి"

"తనకి రాకపోతే చూసి నేర్చుకోకూడదుటమ్మా! అవ్వ! అందరూ మనలాగే ఉంటున్నారా?" రామానికి ఏమిటో తెలిసిపోయింది. స్వల్పవిద్యాసంస్కారంగల మధ్యతరగతి తెలుగు స్త్రీకి ఎలాంటికోరికలుంటాయో అతనికి తెలుసు. ఏముందీ? ఎదురింటి జంట రోజూ బీచికి వెడతారనో, కాంతం మొగుడు ప్లాస్టిక్ చీరలు తెచ్చాడనో, వాళ్ళ అన్నలా తను సరస్వతిని సెలవల్లో మైసూరు తీసికెళ్ళలేదనో- యింతకంటె ఎక్కువ కోరికలు ఏముంటాయి? రామం నవ్వుకున్నాడు. కాని సరస్వతి మాటలు విని ఆశ్చర్యపోయాడు.

"ఆడదాన్ని పువ్వులా వాడుకోవాలి. అతి సున్నితంగా చూడాలి. నే అన్నానని కోపం వద్దు. పక్కింటి ప్లీడరుగార్ని చూడండి, ఆయన పెళ్ళాం ఎంత అదృష్టవంతురాలో! కడుపుతో ఉన్నన్నాళ్ళూ వారానికి రెండుసార్లు లేడీ డాక్టర్ని కారులో పిలిపించేవారు. మనలా హోమోపతీ రంగన్నగారిని కాలిసడకని కాదు. నేనొకసారైనా ఆ లేడీడాక్టరు మొహం ఎలా ఉంటుందో ఎరుగుదునా? ఆవిడవచ్చి రోజుకో యింజక్షను యిస్తోంది. నిజంగా ఆ యిల్లాలు ఎంత అదృష్టవంతురాలో! నలుగురూ ఎంతలా చెప్పుకుంటున్నారనీ! నేనూ ఉన్నాను, ఓ ఆలనా పాలనా?" సరస్వతికంట్లో నీటిచుక్కలు కనిపించేయి రామానికి. అతనికి ఆ బిందువులుచూస్తే కరుణ కలుగకపోగా అసహ్యం వేసింది. ప్లీడరుగారి పాపాయిని తనూ చూశాడు. ఎముకతప్ప మాంసంలేదు ఆ తల్లీ అంత బలహీనురాలే అందుకని డాక్టర్ని పెట్టేరు. తనభార్య స్వతహా బలమైనది. పురుడు సుళువుగా రావడానికీ, పథ్యపానాదులు చేయించడానికీ, పిల్లని బంతిలా తయారుచేయడానికీ హోమ్ డాక్టర్ 'అమ్మ' ఉండనేవుంది. ఆరోగ్యవంతులైనందుకు సంతోషపడక క్షుద్రమైన యీ పోలికలేమిటి? నలుగురు ఆడవాళ్లు కలిసినప్పుడు నా పురుడు మరీకష్టమైందంటే నాది మరీ కష్టమైందనే అతినీచమైన క్వాలిఫికేషన్‌కోసం దెబ్బలాటలు ఎప్పుడు మానుతాయి? తను సరస్వతికే సానుభూతి చూపిస్తే తోటి గుమస్తా రమణయ్యలా ఏరోజు కారోజు 'ఇవాళ మా ఆవిడ బతుకుతుందనుకోలేదు' అని అదో గొప్పలా చెప్పుకుని నలుగురినవ్వుకీ కారణమౌను! ఇంకానయం. ఛత్. ఇలాంటివి మొగాళ్ళకుంటే ఆడాళ్లూ, ఆడాళ్లకుంటే మొగాళ్ళూ అణిచిపారెయ్యాలిబాబూ.

* * *

అమావాశ్యా, అర్థరాత్రీ, అరుపులూ, అందరూ లాంతర్లతో అక్కడికి రావడం, దొంగ పారిపోడం అన్నీ నిమిషాలమీద జరిగిపోయాయి. ఏది ఎలా జరిగినా కాలాన్ని మంచినీళ్ళలా వాడుకునే మనవాళ్ళకి తీరికకేంలోటూ? ఎదురింటి పెద్ద అరుగుమీద అందరూ సమావేశమై వారి వారి యిళ్ళల్లో జరిగిన పాతదొంగతనాలు నెమరువేసుకుంటున్నారు. కరణం అందుకున్నాడు.

"ఛస్, యిదీ ఓ దొంగతనమేటండీ? ఇంతకు మించినవి ఎన్నిచూచాం, ఎన్ని విన్నాం!"

"ఎక్కడిదాకానో ఎందుకూ! అవాళ ఏం జరిగిందిటూ, మా బావ ఊళ్లో లేడట, సరిగ్గా అరడజనుమందిట, నల్లటి భయంకరమైన, బలిష్ఠ

మైన శరీరం వాళ్ళూను. మా పెద్దక్క ఒంటరిదీ, ఆడదీ ఏంచేస్తుందీ?..." కరణాన్ని నాయుడు పూర్తిగా చెప్పనియ్యలేదు.

"అవీ నలుగురిలో చెప్పవలసిందేనుటయ్యా-చాల్చాలు-మా వూరి డాక్టర్ని ఎంత అన్యాయంగా పాడిచేశారు!" మునసబు అందుకున్నాడు.

"అక్కడితో అపుతే బాగానే ఉంది. ఆ జానికమ్మ! చెయ్యెత్తి మొక్కవలసిన తల్లి! ఏం చేశారు? తెల్లారేసరికి ఉరిపెట్టుకుని చచ్చిందే!"

దొంగతనం జరిగిన యింటిగృహస్థు భడాలు మని తలుపువేసుకున్నాడు. అతనికున్న ఆస్తి రెండు వెండికంచాలూ, ఒక పెట్టెడు మంచి బట్టలూ పోయాయి. అంతకన్న ఎవరికో ఎక్కువ నష్టం కలుగుతే యితనికి వచ్చిందేమిటి? ఈ శుష్క విమర్శలూ, నీచమైన పోలికలూ యీ పెద్దమనుషులు ఎప్పుడు మానతారు?

* * *

ఆదర్శపురుషుల అడుగుజాడలలో నడవమనీ బుద్ధిమంతులతో పోలికలు తెచ్చుకుని వారిని అనుసరించమనీ పెద్దలవాక్కు. "ఆ కుర్రాడు ఫస్టుమార్కు తెచ్చుకున్నాడు. నేనెందుకు తెచ్చుకోలేను?" "వాడికన్న నేను పెద్దవాణ్ని. ఆ మాత్రం బలం నాకెందుకు లేదు?" "ఆవిడ ముప్ఫైయేళ్ళ ఏట అ ఆలు మొదలెట్టి ఎమ్మెస్సీ ప్యాసయింది. నేనందులో సగం కృషిచేసి మెట్రిక్ ఎందుకు ప్యాసవలేనూ?" ఇలాంటి ఉచితమైన పోలికలు తెచ్చుకుని స్వశక్తితో సంస్కారాన్ని పెంపొందించుకుందామని కృషిచేసేవారు చాలా తక్కువ. వీళ్ళుగాక యింకో రకంవాళ్లున్నారు. వీళ్ళెప్పుడూ అందుబాటులో లేని, తమకన్న ఏదో ఒకవిషయంలో ఉన్నతులైన యితరుల్ని పోల్చుకుని నిరంతరం విచారిస్తూ ఉంటారు. బంగారంతో బొంగరాలాడుకునే వ్యాపారికి తన్నిగురించి ఎవరూ ఎప్పుడూ చెప్పుకోరని ఏడుపు. స్థితిలో తమకన్న ఏదోవిధంగా ఎక్కువవారినేగాని తక్కువవారిని పోల్చుకుని సుఖపడడం చాలామందికి చేతగాదు. అప్పుడు కాచిన వేడివేడి నెయ్యీ, చెట్టునదింపిన మామిడి పండూ, యింట్లోకాసిన లేతవంకాయలూ ఎప్పుడూ పట్నవాసపు పిల్లకి జ్ఞాపకంవస్తే తారురోడ్డుమీద కారుప్రయాణం, స్టౌమీద (చక్కగా!) వండుకోడం, రోజుకో సినిమాకి వెళ్ళడం పల్లెటూరిపిల్లని బాధిస్తూ ఉంటాయి. తమకన్న కొంచెం ఎక్కువయినవాళ్ళని చూసి ఏడవడం చాలామందికి అలవాటు. కిరాణాకోమటి కిల్లీ కొట్టువాణ్ని, మామూలు రిక్షా సైకిలు రిక్షావాణ్ని, గుమాస్తా టీచర్ని పోలికలకి తెచ్చుకుని కుమిలిపోవడం నలుగురికీ తెలిసిందే. ఇంకొకర్ని చూసి అసూయపడ్డం అన్యాయమైనా యీ పోలికల్లో అంతోయింతో రీజను ఉంది. వీటన్నిటికంటె క్షుద్రమైనవి నే మొదట చెప్పినవి.

"అతనికేం అదృష్టం! ఒకపార్టైనా ప్యాసయ్యాడుగా, మావాడివి మూడూ పోయాయిగా!"

"చచ్చినంత జబ్బుచేసినా ఆ అమ్మాయి బ్రతికింది. ఇది పోయినా యింకా వాళ్ళకి నలుగురున్నారు. మేమూ ఉన్నాం, ఎందుకూ?"

"వాళ్ళ సుశికి యిరవైతొమ్మిదో ఏడు. అంతకన్న రెండేళ్ళు పెద్దదైతే అయింది. మా రాజ్యానికి పెళ్ళి గీత ఏదీ?"

ఇలాంటివి ఉపేక్షించి లాభంలేదు. కట్టుకట్టి బహిష్కరించాలి. విజ్ఞానులని పోల్చుకుని ఉన్నతులం కావాలి.

* * *

ఏదో లేనిది అందుకోలేనిది నిత్యం తలుచుకుని దుఃఖపడడంలో సుఖమేముంటుంది? కుదురుగా విషయ విచక్షణ చేసుకుంటే మనకంటె ఎక్కువవాళ్ళ కన్న తక్కువవాళ్ళు ఎంతమంది లేరు? రెండు చీరలకంటె ఎక్కువలేని యిల్లాలు బీరువానిండా మైసూరు జార్జెట్ చీరలున్న బంధువురాల్ని తల్చుకోడంకంటె, పొద్దుటే అరగజం గుడ్డ కట్టుకునివచ్చిన బిచ్చగత్తెను తల్చుకోడంలో ఎంత సుఖమూ, ఆత్మతృప్తీ లేవు? వాళ్ళింట్లో బారులైటుందనీ, వీళ్ళింట్లో రెండు పూట్లా టిఫిన్లు చేసుకుంటారనీ తలుచుకుంటే మనకి వచ్చిందేమిటి? ఈ జీవన ప్రమాణంలో మధ్య తరగతివాళ్ళం కొండ నడుమనున్నాం. పైకి చూసేకన్న క్రిందకి చూస్తేనే సుఖ మెక్కువ. అలా సుఖపడ్డమే అలవరుచుకోవాలి. ★